నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో..




గద్వాలలో స్కార్ఫ్ కట్టుకొని వెళ్తున్న విద్యార్థులు

# సుర్రుమంటోంది..

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బకు గురవుతున్న ప్రజలు
- స్కార్ఫ్, రుమాలు వంటి వస్త్రాలతో జాగ్రత్తలు
- చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్న వైద్యులు

హన్వాడ/గద్వాల/గద్వాల టౌన్, ఏప్రిల్ 4 : ముదురుతున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో పనుల నిమిత్తం బయటికి వచ్చే వారు వడదెబ్బకు గురవుతున్నారు. దీంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 10గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతుండడంతో చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు సైతం ఎండను తాళలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, గొర్రెలను కాసే కాపరులు ఎండవేడిమిని తట్టుకోలేకపోతున్నారు. వడగాలులు వీస్తుండడంతో ప్రయాణికులు సైతం బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రజలెవరూ బయటికి రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే శరీరంలో నీటిశాతం తగ్గి డీహైడ్రేషన్‌తో అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

### ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఎండ తగలకుండా స్కార్ఫ్, రుమాలు, క్యాప్, గొడుగు రక్షణగా ఉపయోగించాలి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులకు వడదెబ్బ తగిలే అవకాశమున్నది. వడదెబ్బకు గురైతే వెంటనే దవాఖానకు తరలించి చికిత్స చేయించాలి. – ప్రగతి, వైద్యాధికారి, హన్వాడ

### వడదెబ్బ లక్షణాలు, కారణాలు

- శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం.
- విపరీతమైన తలనొప్పి.
- నాడి వేగంగా కొట్టుకోవడం.
- నాలుక తడి ఆరిపోవడం.
- శరీరంలో నీటిశాతం తగ్గడం.
- వాంతులు, విరోచనాలు అవుతాయి.
- నీరు తక్కువగా తీసుకోవడం

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగరాదు.
- తప్పని పరిస్థితుల్లో గొడుగు, తలకు టోపీ, ముఖానికి రుమాల్‌తో ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి.
- నీరు లేదా ఇతర ద్రవ పదార్థాలను వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి.
- అతి చల్లని నీరు, పానీయాలు తీసుకోరాదు.
- వడదెబ్బకు గురైన వారిని సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లాలి.
- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి.
- పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలి.

### ప్రథమ చికిత్స..

- వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశంలోకి చేర్చాలి.
- చల్లని నీటిలో అద్దిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి.
- కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్ లేదా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి.
- ప్రథమ చికిత్స అనంతరం ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.





గద్వాలలో ఫ్యాన్ తీసుకెళ్తున్న వృద్ధుడు, సైకిల్‌పై స్కార్ఫ్ కట్టుకొని వెళ్తున్న విద్యార్థిని



నాలుగు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

| తేదీ | గరిష్ఠం |
|---|---|
| 01 | 42 డిగ్రీలు |
| 02 | 42 డిగ్రీలు |
| 03 | 43 డిగ్రీలు |
| 04 | 41 డిగ్రీలు |



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

### బెంబేలెత్తుతున్న ప్రజలు

అలంపూర్, ఏప్రిల్ 4 : నడిగడ్డలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు ఉదయం పూటే పనులు ముగించుకుంటున్నారు. దీంతో మధ్యాహ్నం వేళ రహదారులన్నీ నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. రాబోవు రోజుల్లో ఎండ వేడిమి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

**వాతావరణ శాఖ హెచ్చరికలు ఇలా..**

- సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే వైట్ అలర్ట్‌గా ప్రకటిస్తారు.
- సాధారణానికి మించి నమోదైతే హెటీ వేవ్ వార్నింగ్ ఎల్లో అలర్ట్.
- మామూలు కంటే 4–5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైతే ఆరెంజ్ అలర్ట్.
- మామూలు కంటే 6 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత, తీవ్ర వడగాల్పులు ఉంటే రెడ్ అలర్ట్‌గా ప్రకటిస్తారు.

# ఎండ ప్రచండం

- మండే ఎండలతో బెంబేలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- ఉపశమనానికి దారులు వెతుక్కుంటున్న ప్రజలు
- శీతల పానీయాల వైపు పరుగులు
- రానున్న రెండ్రోజులు మరింత తీవ్రత
- చిన్నారులు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : సూర్య ప్రతాపం పెరిగిపోయింది. మరో ఐదురోజుల పాటు తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. రెండు వారాలుగా పగటిపూట ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. సాధారణానికి మించి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తప్పనిసరి పనిపై వచ్చే ప్రజలు గొడుగులు పట్టుకొని, టవళ్లు, టోపీలు, మహిళలైతే చీర కొంగులు తలపై కప్పుకొని రోడ్డెక్కుతున్నారు. దీంతో మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం వడగాల్పులు వీస్తూ సాయంత్రం 7 గంటల వరకూ ఎండ ప్రభావం ఉంటోంది. రోడ్ల వెంట టోపీలు, మట్టి కుండలు, కూలింగ్ అద్దాల అమ్మకాలు జోరందుకున్నాయి. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలను తాగుతున్నారు. ఉదయం 12గంటలలోపే పనులు ముగించుకొని ఇండ్లకు రావాలని, సాయంత్రం 4 గంటల తర్వాత బయటికి వెళ్లడం శ్రేయస్కరమని వైద్యులు సూచిస్తున్నారు.



### నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు

ఎండాకాలంలో అత్యవసర పనులుంటేనే బయటకు వెళ్లాలి. అప్పుడు కూడా సరైన జాగ్రత్తలు పాటించాలి. ఎందుకంటే వడదెబ్బ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్న వారు ఇండ్లల్లోనే చల్లటి ప్రదేశంలో ఉండాలి. కూల్‌డ్రింక్స్ కంటే మజ్జిగ, కుండలోని నీళ్లు, కొబ్బరి బొండాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వదులైన, కాటన్ దుస్తులు ధరించాలి.
– సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌వో

### వేడి నుంచి ఉపశమనానికి..

- ఇంట్లో వాతావరణం చల్లగా ఉండేలా కిటికీలు, తలుపులకు కర్టెన్లు వేసుకొని నీళ్లు చల్లుకోవాలి.
- ఎండలోకి వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ లోషన్లు, కూలింగ్ పౌడర్లు ఉపయోగించాలి.
- శీతల పానీయాలకు బదులుగా పండ్ల రసాలు, నిమ్మకాయ, చెరుకు, సబ్జా రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగాలి.
- కొబ్బరి బొండాలు, కీరదోస, కర్బూజా వంటి పండ్లు తినాలి
- రోజుకు నాలుగైదు లీటర్ల నీళ్లు తాగాలి.
- ఎండలో ప్రయాణిస్తే గొడుగు, టోపీ, కూలింగ్ అద్దాలు, హెల్మెట్, గ్లౌజులు ఉపయోగించాలి.
- రోజుకు రెండుసార్లు స్నానం చేయాలి.
- బయటికి వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్ తీసుకెళ్లడం, వీలైతే చెట్ల నీడలో ఉండేందుకు ప్రయత్నించాలి.
- డీ హైడ్రేషన్‌కు గురైతే మంచినీళ్లు, కొబ్బరి నీళ్లు తాగాలి.
- పరిస్థితి తీవ్రంగా ఉంటే తప్పకుండా దవాఖానకు వెళ్లాలి.
- తల్లిదండ్రులు తమ పిల్లలను ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి.
- ఈత కొట్టడం కోసం చెరువులు, బావుల వద్దకు వెళ్లేటప్పుడు తోడుగా ఉండాలి.
- దోమలు కుట్టకుండా రాత్రి వేళ కాయిల్స్, దోమతెరలు ఉపయోగించాలి.
- మసాలాలు, మాంసాహారం తగ్గించాలి.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీళ్లు తాగరాదు.
- బైకులు, కార్లను నీడలోనే ఉంచాలి.



మహబూబ్‌నగర్‌లో స్కార్ఫ్ కట్టుకొని స్కూటీపై వెళ్తున్న మహిళ



నాగర్‌కర్నూల్‌లో కూలర్‌ను తీసుకెళ్తున్న దృశ్యం

# అమరచింతలో వీగిన అవిశ్వాసం



మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి హాజరైన నలుగురు కౌన్సిలర్లు

- అసంతృప్త కౌన్సిలర్లకు చుక్కెదురు
- పాలకవర్గం కొనసాగుతుందని వెల్లడించిన ప్రిసైడింగ్ అధికారి

అమరచింత, ఏప్రిల్ 4 : అమరచింత పురపాలక చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్‌చైర్మన్ గోపిపై ఆరుగురు కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి పద్మావతి వెల్లడించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీకి కేటాయించిన నిధులను చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పురపాలక అధికారులతో కుమ్మక్కై దండుకున్నారని, వారిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని గత నెల 16వ తేదీన బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి, సింధు, బీజేపీకి చెందిన లావణ్య, ఊషారాణి, సీపీఐకి చెందిన విజయరాములు, సీపీఎంకి చెందిన మాధవి రాతపూర్వకంగా కలెక్టర్‌కు లేఖ అందజేశారు. కాగా ఏప్రిల్ 4న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు గత నెల 18న చైర్‌పర్సన్‌తోపాటు వైస్‌చైర్మన్, కౌన్సిలర్లకు నోటీసులు అందించామన్నారు. ఈక్రమంలో గురువారం 11 గంటలకు భారీ బందోబస్తు మధ్య మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంగమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, సింధు, సీపీఐ పార్టీకి చెందిన విజయరాములు, బీజేపీకి చెందిన లావణ్య మాత్రమే హాజరు కావడంతో అసంతృప్త కౌన్సిలర్లకు అరగంట సమయం ఇస్తూ మళ్లీ నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ ఎవరూ రాలేదు. అదేవిధంగా వైస్‌చైర్మన్ గోపిపై పెట్టిన అవిశ్వానికి సైతం నలుగురు మాత్రమే హాజరు కావడంతో.. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని ఇప్పుడున్న పాలకవర్గమే కొనసాగుతుందని ప్రిసైడింగ్ అధికారి వెల్లడించారు.

## వడదెబ్బతో వృద్ధుడు మృతి

లింగాల, ఏప్రిల్ 4 : వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందిన ఘటన శ్రీరంగాపూర్‌లో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. శ్రీరంగాపూర్‌కు చెందిన మర్రిపల్లి ఈరయ్య (70) బుధవారం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అనుమానం వచ్చి సాయంత్రం పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈరయ్య భార్య ఇదివరకే మృతి చెందగా అతడికి ఏడుగురు సంతానం ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

## యువతి కిడ్నాప్

రాజాపూర్, ఏప్రిల్ 4 : రాజాపూర్ మండలంలోని దోండ్లపల్లికి చెందిన యువతిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై రవి కథనం ప్రకారం.. దోండ్లపల్లికి చెందిన గుంతల జంగయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. బుధవారం భార్యాభర్తలు నాగర్‌కర్నూల్‌లో పెళ్లికి వెళ్లగా, కుమారులు కంపెనీలో పని చేసేందుకు వెళ్లారు. ఇంటి వద్ద కూతురు(21) ఒక్కతే ఉన్నది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసిన కుటుంబ సభ్యులకు యువతి కనిపించలేదు. కాగా, హెల్మెట్‌తో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై యువతిని తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. యువతి తండ్రి అనుమానిత వ్యక్తులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# 15వేల వడ్ల బస్తాలు చోరీ

- వ్యవసాయ శాఖ గోదాం నుంచి ఎత్తుకెళ్లిన దుండగులు
- వెల్దండ మండలం పెద్దాపూర్‌లో ఘటన

కల్వకుర్తి, ఏప్రిల్ 4 : వ్యవసాయశాఖ మార్కెట్ గోదాంలో నిల్వ ఉంచిన దాదాపు 15వేల వడ్ల బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం హైవేకు కాస్త లోపలికి ఉన్న వ్యవసాయ శాఖ గోదాంలో పెద్ద ఎత్తున వడ్ల బస్తాలు చోరీకి గురికావడం సంచలనంగా మారింది. కల్వకుర్తి పట్టణానికి చెందిన జూలూరి రమేశ్‌బాబుకు స్థానికంగా సద్గురు రాఘవేంద్ర పారా బాయిల్డ్ మిల్లు ఉన్నది. సీఎమ్మార్‌లో భాగంగా కల్వకుర్తికి చెందిన సద్గురు రాఘవేంద్ర రైస్‌మిల్లు యజమానికి ప్రభుత్వం లక్షన్నర క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించింది. కాగా రమేశ్‌బాబు పెద్దాపూర్ వద్ద వ్యవసాయ శాఖకు చెందిన గోదాంలో ధాన్యాన్ని నిల్వ చేశాడు. ఈక్రమంలో వ్యాపారి అద్దె చెల్లించడం లేదని మార్కెటింగ్‌శాఖ అధికారులు గోదాంకు తాళాలు వేశారు. సీఎమ్మార్‌కు సంబంధించిన ధాన్యాన్ని నిల్వ ఉంచిన గోదాంలకు అద్దె చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెప్పిందని సదరు వ్యాపారి మార్కెట్ అధికారులకు చెప్పగా వారు జీవో కాపీలు చూపించాలని అడిగారు. దీంతో వ్యాపారి చేసేదేమీలేక మిన్నకుండిపోయారు. ఇది జరిగి ఏడాది కావచ్చింది. ఈమధ్యకాలంలో వనపర్తి జిల్లా చిన్నంబావిలో ధాన్యం చోరీ జరిగిన ఘటనలో ఒక నిందితుడు పట్టుబడ్డాడు. అదేవిధంగా బల్మూరు, కోడేరు గ్రామాల్లోనూ ధాన్యం చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో అనుమానం వచ్చిన మార్కెట్ అధికారులు పెద్దాపూర్ వద్ద ఉన్న గోదాంకు వెళ్లి చూడగా అప్పటికే షట్టర్లు తెరిచి ఉన్నాయి. వ్యాపారి రమేశ్‌బాబుకు సమాచారం అందించగా అతడు అక్కడికి చేరుకొని దాదాపు 15వేల బస్తాల ధాన్యం చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఘటనపై రమేశ్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గోదాంలకు అద్దె చెల్లించకపోవడంతో, మార్కెటింగ్ శాఖ అధికారులు తాళాలు వేసిన సంగతి గుర్తించిన దుండగులు ఈ చోరీకి పాల్పడినట్లు చర్చించుకుంటున్నారు. దుండగులు చోరీ చేసిన ధాన్యాన్ని నాగర్‌కర్నూల్‌లో ఓ వ్యాపారికి విక్రయించినట్లు రైస్ మిల్లులకు చెందిన కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వడ్ల బస్తాల చోరీపై వ్యాపారి రమేశ్‌బాబు సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేశారు.



దుండగులు ఎత్తుకెళ్లగా మిగిలిన వడ్ల బస్తాలు

# ఆరని మంటలు

- గోదాం అగ్ని ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తు

పెబ్బేరు, ఏప్రిల్ 4 : పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. రూ.15 కోట్ల విలువైన ఆస్తి నష్టానికి కారణమైన ఈ ప్రమాదం జరిగి నాలుగు రోజులైనా దర్యాప్తు కొనసాగుతూనే ఉన్నది. జిల్లా యంత్రాంగం, పోలీసులు వేర్వేరుగా దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఫోరెన్సిక్, క్లూస్‌టీం బృందాలు ఘటనా స్థలాన్ని పరిశీలించాయి. ప్రధానంగా ఫోరెన్సిక్ నివేదిక వస్తేనే అసలు విషయం బయట పడుతుందని అందరూ భావిస్తున్నారు. కాగా ఇంకా గోదాంలో మంటలు చెలరేగుతున్నాయి. రెండు కంపార్టుమెంట్లలోని సీఎంఆర్ ధాన్యాన్ని తొలగించే ప్రక్రియ పూర్తికాగా మధ్య కంపార్టుమెంట్‌లో మిగిలి ఉన్న కొన్ని గన్నీ బ్యాగుల కట్టలను బయటకు తెచ్చేందుకు సాధ్యం కాకపోవడంతో అవి ఇప్పటికీ కాలుతూనే ఉన్నాయి. బయట వేసిన గన్నీ బ్యాగుల నుంచి కూడా పొగలు వస్తుండగా ఫైర్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రస్తుత యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేసేందుకు మార్కెటింగ్ శాఖ 12.80 లక్షల గన్నీ బ్యాగులను గోదాంలో ఉంచగా.. అవన్నీ అగ్నికి ఆహుతయ్యాయి.

మిల్లర్లు కొందరు గోదాంను అద్దెకు తీసుకొని 70వేల సీఎంఆర్ ధాన్యం బస్తాలను నిల్వ ఉంచగా వాటిలో 30శాతం పనికి రాకుండా పోయాయి. సీఎం కేసీఆర్ హయాంలో రూ.3.75 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం పూర్తిగా పనికిరాకుండా పోయింది.



ఆలయ నిర్మాణ దాతలను సన్మానిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి దంపతులు

# భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 4 : ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం మరింత పెంపొందుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిట్యాలలోని నూతన శివాలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో ఐక్యతాభావం పెరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్మాణ దాతలను వారు సత్కరించారు. అదేవిధంగా మాజీమంత్రి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ వెంకట్రావ్, మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు, జితేంద్రరావు, విష్ణురావు, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తనిఖీల్లో రూ.13.15 లక్షలు సీజ్

రాజాపూర్, ఏప్రిల్ 4 : మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై ఓ వాహనంలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 8,41,700 నగదును పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. రూ.50వేలకు మించి నగదు తరలిస్తే అందుకు సంబంధించిన బిల్లులు పెట్టుకోవాలని ఎస్సై రవి సూచించారు.

### గద్వాల జిల్లాలో రూ.4,73,500 సీజ్

గద్వాల అర్బన్/ఉండవెల్లి, ఏప్రిల్ 4 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నట్లు ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. గురువారం గట్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.76 లక్షలు, ఉండవెల్లి మండలం పుల్లూరు చెక్‌పోస్టు వద్ద రూ.1,97,500 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన నగదును గ్రీవెన్స్ రిడ్రెసెల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా అధిక మొత్తంలో నగదును తరలించొద్దని సూచించారు. ఒకవేళ రూ.50 వేలకు మించి తీసుకెళ్లాల్సి వస్తే అందుకు సంబంధించిన రసీదులు తప్పనిసరిగా చూపించాలన్నారు.

### మద్యం పట్టివేత

ఉండవెల్లి మండలం ప్రాగటూరులో అక్రమంగా నిల్వ ఉంచిన 61మద్యం సీసాలను ఏఎస్సై సుబ్బారెడ్డి పట్టుకొన్నారు. అనంతరం మోసన్‌రాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.